AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
10-9-2025 (Wednesday)
MAIN EDITION

## నేడు యూఏఈతో తలపడనున్న భారత్




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** ఆసియా కప్ టోర్నీలో భారత జట్టు తొలి సమరానికి సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న టీమిండియా బుధవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే తుది జట్టులో ఎవరు ఉంటారనే ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా సంజూ శాంసన్, తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే వంటి ఆటగాళ్ల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.

## టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు



**అక్షరటుడే, తిరుమల :** టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఐఏఎస్‌ల బదిలీ చేపట్టిన ప్రభుత్వం అనిల్‌ను టీటీడీ ఈవోగా నియమించిన విషయం తెలిసిందే. అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం అలిపిరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. టీటీడీ ఈవోగా రెండో సారి నియమితులైన మొదటి అధికారిగా సింఘాల్ నిలిచారు. ఆయన గతంలో 2017 మే నుంచి 2020 అక్టోబర్ వరకు ఈవోగా పనిచేశారు.



## పదో తరగతి అర్హతతో రైల్వేలో ఉద్యోగాలు

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్ :** భారతీయ రైల్వేలో ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నవారికి ఈస్టర్న్ రైల్వే శుభవార్త చెప్పింది. స్పోర్ట్స్ కోటాలో పలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఇందులో భాగంగా మొత్తం 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. 2026 జనవరి ఒకటో తేదీ నాటికి 18 నుంచి 25 ఏళ్లలోపు వారు అక్టోబర్ 9వ తేదీలోపు వారు అర్హులు. పూర్తి వివరాలకు http://www.rrcer.org/ వెబ్‌సైట్‌ను సంప్రదించండి.




## మండీ బిర్యానీలో బొద్దింక..

**అక్షరటుడే, హైదరాబాద్ :** మండీ బిర్యానీ తింటుండగా బొద్దింక రావడంతో కస్టమర్లు షాక్ అయ్యారు. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. నగరంలోని ముషీరాబాద్‌లో గల అరేబియన్ మండీ రెస్టారెంట్‌లో బిర్యానీ తినడానికి కొంత మంది స్నేహితులు వెళ్లారు. అందరూ కలిసి తింటుండగా.. బిర్యానీలో బొద్దింక రావడంతో వారు షాక్ అయ్యారు. ఇదేమిటని రెస్టారెంట్ నిర్వాహకులను ప్రశ్నిస్తే వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. అంతేగాకుండా వారిని బెదిరించారు. దీంతో యువకులు రెస్టారెంట్ ఎదుట ఆందోళన నిర్వహించగా.. పోలీసులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పి వారిని అక్కడి నుంచి పంపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష కూటమికి షాక్ తగిలింది. ఓడిపోతామని తెలిసినా.. అభ్యర్థిని నిలబెట్టిన ఇండి కూటమికి తమ ఎంపీలు షాక్ ఇచ్చారు. పలువురు విపక్ష ఎంపీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి లెక్క ప్రకారం 315 ఓట్లు రావాలి. కానీ 300 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో క్రాస్ ఓటింగ్‌కు ఎవరు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ విచారిస్తోంది. ఈ మేరకు త్వరలో సమావేశం నిర్వహించడానికి సిద్ధమవుతోంది. అలాగే కొందరు ఎంపీలు కావాలనే చెల్లని ఓట్లు వేసినట్లు పార్టీ అనుమానిస్తోంది.**

—అక్షరటుడే, హైదరాబాద్




# క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ పోస్టుమార్టం

■ 15 ఓట్లు చెల్లకపోవడంపైనా అనుమానం ■ త్వరలోనే సమావేశం నిర్వహించే అవకాశం

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. క్రాస్ ఓటింగ్ చేసిందెవరు.. ఓట్లు చెల్లకుండా పోవడానికి గల కారణాలపై పోస్టుమార్టం ప్రారంభించింది. మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండి కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఓటమి మూటగట్టుకున్నారు. ఎన్డీయే అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. అయితే, విపక్ష పార్టీల సభ్యుల బలం కంటే సుదర్శన్‌రెడ్డికి తక్కువ ఓట్లు రావడం ఇండి కూటమిని నివ్వెర పరిచింది. రాధాకృష్ణన్‌కు ఊహించిన దాని కంటే ఎక్కువ మెజార్టీ రావడంతో క్రాస్ ఓటింగ్ జరిగిందని తేలిపోయింది. ఈ నేపథ్యంలో అసలు ఏం జరిగిందన్న దానిపై కాంగ్రెస్ దృష్టి సారించింది.

### ఉద్దేశపూర్వకంగానేనా..

మంగళవారం జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ లేదా ఉద్దేశపూర్వకంగా చెల్లని ఓట్లు వేసిన వారిని గుర్తించడానికి త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ మరియు రాజ్యసభ ప్రస్తుత బలాన్ని బట్టి చూస్తే, రాధాకృష్ణన్ కు ఎన్డీయే ఎంపీల నుంచి కనీసం 427 ఓట్లు పొందుతారని అంచనా వేశారు. అలాగే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 11 ఓట్లు కూడా పడడంతో ఆయనకు 438 ఓట్లు పడతాయని భావించారు. అయితే, రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు పోలయ్యాయి. అదే సమయంలో విపక్షాల బలాన్ని బట్టి 315 ఓట్లు రావాల్సిన బి. సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు మాత్రమే వచ్చాయి.

### మహారాష్ట్ర ఎంపీలు, ఆప్‌పైనే అనుమానం..


ఏకంగా 15 ఓట్లు తగ్గిపోవడంపై కాంగ్రెస్ పోస్టుమార్టం ప్రారంభించింది. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి ఏడుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు అనుమానిస్తోంది. శివసేన నుంచి మూడు, కాంగ్రెస్ నుంచి నాలుగు ఓట్లు బీజేపీ అభ్యర్థికి పడ్డాయని భావిస్తోంది. ఇక తమిళనాడు మూలాలున్న రాధాకృష్ణన్‌కు మద్దతుగా డీఎంకే నుంచి కూడా క్రాస్‌ఓటింగ్ జరిగి ఉండొచ్చని అనుమానిస్తోంది. అలాగే, ఆమ్ ఆద్మీ పార్టీ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయలేదని భావిస్తోంది. ఓటు ఎలా వేయాలనే దానిపై విపక్ష ఎంపీలకు అవగాహన కల్పించినప్పటికీ, 15 ఓట్లు చెల్లకుండా పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు ఎంపీలు కావాలనే ఓట్లు చెల్లకూడదనే భావనతో తప్పుగా ఓటేసినట్లు అనుమానిస్తున్నారు.

## ఐసిస్ ఉగ్రవాదుల అరెస్టు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఉగ్రవాద నిరోధక చర్యల్లో భద్రతా దళాలు కీలక విజయం సాధించాయి. ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులను అరెస్టు చేశాయి. భారత్‌లో రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న అషర్ డానిష్ అనే ఐసీస్ ఉగ్రవాదిని బుధవారం రాంచీలో అరెస్టు చేశారు. అతడు బొకారో జిల్లాలోని పెట్వార్‌కు చెందినవాడు. ఢిల్లీలో నమోదైన కేసు నేపథ్యంలో అక్కడి స్పెషల్ సెల్ బృందంచాలా కాలంగా అతని కోసం వెతుకుతోంది. ఈ క్రమంలో అతడి కదలికలపై పక్కా సమాచారం అందుకున్న ఢిల్లీ స్పెషల్ సెల్, జార్ఖండ్ ఏటీఎస్, రాంచీ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రాంచీలోని ఇస్లాంనగర్‌లో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రహస్య స్థావరానికి తరలించి విచారిస్తున్నారు. అదే సమయంలో ఢిల్లీలో మరో ఐసిస్ ఉగ్రవాదిని కూడా అరెస్టు చేశారు. అఫ్తాబ్ అనే వ్యక్తి ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా 12 చోట్ల ప్రత్యేక బృందాలు, కేంద్ర బలగాలు కలిసి సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే మొత్తం 8 మందికి పైగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరికొంత మందిని కూడా అరెస్టు చేసే అవకాశముంది.


## 'వర్టెక్స్' భూ వివాదం.. హైడ్రా కీలక వ్యాఖ్యలు




**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రైవేటు భూములకు సంబంధించిన వివాదాల జోలికి వెళ్లమని హైడ్రా మరోసారి స్పష్టం చేసింది. వర్టెక్స్ రియల్ ఎస్టేట్‌కు సంబంధించి హైడ్రాపై వచ్చిన ఆరోపణలను సంస్థ ఖండించింది. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నగరంలోని పలు చెరువుల్లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. అంతేగాకుండా అనేక పార్కుల్లో కబ్జాలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. అయితే వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థపై హైడ్రా చర్యలు తీసుకోవడం లేదని సుంకరి నరేష్ అనే వ్యక్తి ఆరోపణలు చేశారు. ఆయన ఆరోపణలను హైడ్రా కొట్టిపారేసింది. ప్రైవేట్ భూ వివాదాల జోలికి తాము వెళ్లమని పేర్కొంది. అదే సమయంలో చెరువులు, నాలాలు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరిగితే ఊరుకోదని తేల్చి చెప్పింది.



## పండంటి బిడ్డకు జన్మనిచ్చిన లావణ్య త్రిపాఠి..



**అక్షరటుడే, సినిమా డెస్క్ :** మెగా బ్రదర్ నాగబాబు కుమారుడు, మెగా హీరో వరుణ్ తేజ్ తండ్రి అయ్యాడు. ఆయన భార్య, నటి లావణ్య త్రిపాఠి మగ బిడ్డకు జన్మనిచ్చింది. రెయిన్ బో ఆసుపత్రిలో లావణ్య డెలివరీ అయినట్టు తెలిసింది. ప్రస్తుతం తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. విషయం తెలుసుకున్న మెగాస్టార్ చిరంజీవి సైతం 'మన శంకర వరప్రసాద్' సినిమా షూటింగ్ నుంచి నేరుగా హాస్పిటల్‌కు వెళ్లి వరుణ్, లావణ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా.. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు, మెగా ఫ్యాన్స్, పలువురు సినీ ప్రముఖులు ఈ జంటకు విషెస్ చెబుతూ పోస్టులు పెడుతున్నారు.

## ఇళ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యమా?: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైడ్రా పేరుతో ప్రజలను ప్రభుత్వం భయపెడుతోందన్నారు. ఇళ్లు కూలగొట్టడమే ఇందిరమ్మ రాజ్యమా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

### హామీలు ఎగ్గొట్టిన కాంగ్రెస్

అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసగించిందని కేటీఆర్ విమర్శించారు. 'ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చిండ్రు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పిండ్రు. ఒక్కరికైనా ఇచ్చిండ్రా?' అని ప్రశ్నించారు. 'కేసీఆర్ ఉన్నప్పుడు రైతుబంధు టింగు టింగుమని పడుతుండే. ఇప్పుడు వస్తున్నాయా?' అని నిలదీశారు. 'కేసీఆర్ రూ.2 వేల పెన్షన్ ఇస్తే నేను నాలుగు వేలు ఇస్తా అని రేవంత్ చెప్పారు.. అత్తకు, కోడలుకు ఇద్దరికీ పింఛన్ ఇస్తానని చెప్పి నుండే. పెన్షన్ పెంచకుండా, కొత్తవి ఇవ్వకుండా ఎత్తేశారు' అని మండిపడ్డారు. రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలు చేశామని గుర్తు చేసిన కేటీఆర్.. కాంగ్రెస్ రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. పైగా రెండు నెలలు పాటు ముసలోళ్ల పింఛన్లు ఎగ్గొట్టిండ్రు. రైతుబంధు ఎగ్గొట్టిండ్రు అని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పింఛన్లు ఇవ్వకుండా అత్తాకోడళ్ల మధ్య పంచాయితీ పెట్టిండని విమర్శించారు.

### ఉప ఎన్నికలో గెలవాల్సిందే..


జూబ్లీహిల్స్ ఎన్నికలో పైసలు పంచి గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు ధీమాతో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. ఒక్కో ఓటు కీలకమని, కాంగ్రెస్‌కు ఏ మాత్రం అవకాశం ఇవ్వొద్దని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి మాగంటి గోపినాథ్ చేసిన సేవలు గుర్తు చేస్తూ ఓట్లు అడగాలని నాయకులకు సూచించారు. యుద్ధంలా కొట్లాడితేనే విజయం సాధిస్తామని చెప్పారు. అధికారంలో ఉన్న వాళ్లు అన్ని రకాలుగా ప్రలోభపెడతారని, వారిని మనం దీటుగా ఎదుర్కోవాలని సూచించారు.

## రంగంలోకి దిగిన నేపాల్ సైన్యం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** రణరంగంగా మారిన నేపాల్‌లో పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు సైన్యం రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించడంతో పరిస్థితి క్రమంగా మెరుగు పడుతోంది. రెండ్రోజుల పాటు రణరంగం సృష్టించిన యువత ఆర్మీ రాకతో శాంతించింది. నిరసనకారులు వెంటనే ఆందోళనలు విరమించాలని సైన్యం పిలుపునిచ్చింది. తక్షణమే ఆయుధాలు, పేలుడు పదార్థాలను అప్పగించాలని కోరింది. సాయుధ బలగాలు నేపాల్ రాజధాని ఖాట్మండు సహా వివిధ పట్టణాల్లో గస్తీ కాస్తున్నాయి. ఆందోళనకారులు తక్షణమే నిరసనలను విరమించాలని ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్డెల్ కోరారు. ఆందోళనలు పక్కన పెట్టి చర్చలకు రావాలని విజ్ఞప్తి చేశారు.

### సద్దుమణిగిన నిరసనలు..

నేపాల్‌లోని పరిస్థితులు ఇప్పుడిప్పుడే సర్దుకుంటున్నాయి. ఆర్మీ రంగంలోకి దిగడంతో నిరసనకారులు శాంతించారు. ప్రజల సంరక్షణ కోసం ఆందోళనలు విరమించాలన్న సైన్యం విజ్ఞప్తితో నిరసనలు నిలిపి వేశారు. అయితే, దేశంలో వీలైనంత త్వరగా కొత్త ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



**అక్షరటుడే, హైదరాబాద్:** ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని ఆయన కోరారు. మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు ప్రణాళికపై సీఎం వివరించారు. 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు.

## రూ. 30.4 లక్షలు తగ్గిన రేంజ్ రోవర్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** జీఎస్టీ సంస్కరణల ప్రభావం కార్ల ధరలపై కనిపిస్తోంది. కార్ల ధరలు దిగివస్తున్నాయి. రేంజ్ రోవర్ ధర ఏకంగా రూ. 30.4 లక్షలు తగ్గడం గమనార్హం. రేంజ్ రోవర్‌తోపాటు డిఫెండర్, డిస్కవరీ ధరలూ తగ్గాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ శ్లాబ్‌లను మార్చిన విషయం తెలిసిందే. పాత శ్లాబ్‌లలో 5 శాతం, 18 శాతం శ్లాబ్‌లను కొనసాగిస్తూ 12 శాతం, 28 శాతం శ్లాబ్‌లను తొలగించింది. చిన్న వాహనాలపై పన్నులను 28 శాతంనుంచి 18 శాతానికి తగ్గించగా.. లగ్జరీ కార్లు, ఎస్‌యూవీలు, హై ఎండ్ బైక్‌లపై జీఎస్టీని 28 శాతం నుంచి 40 శాతానికి పెంచింది. అయితే గతంలో విధించే 17 నుంచి 22 శాతం సెస్‌ను తొలగించడంతో వీటి ధరలూ పది శాతం వరకు దిగి రానున్నాయి. నూతన శ్లాబ్‌లు ఈనెల 22నుంచి అమలులోకి రానున్నాయి. అంతకు ముందే రేట్ల కోత ప్రయోజనాన్ని కొనుగోలుదారులకు బదిలీ చేయడంపై కంపెనీలు దృష్టి సారించాయి. ఇందులో భాగంగా జాగ్వార్ లాండ్ రోవర్ తన వాహన మోడళ్ల ధరను రూ. 4.5 లక్షల నుంచి రూ.30.4 లక్షల వరకు తగ్గించింది. దీనిని తక్షణమే అమల్లోకి తేవడం గమనార్హం. డిఫెండర్ ధర రూ.7 లక్షల నుంచి రూ. 18.60 లక్షలు, డిస్కవరీ ధర రూ.4.5 లక్షల నుంచి రూ. 9.90 లక్షల మేర తగ్గాయి.

## ఐపీవోకు మంగళ సూత్రాల తయారీ కంపెనీ



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** మంగళసూత్రాలు తయారు చేసే శ్రింగార్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర ఐపీవోకు వచ్చింది. బుధ వారం ప్రారంభమైన సబ్‌స్క్రిప్షన్ శుక్రవారం ముగియనుంది. జోయ్ అలుక్కాస్, టైటాన్, మలబార్ వంటి సంస్థలు క్లయింట్లుగా కలిగిన ఈ కంపెనీపై ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. ఇది మంగళసూత్రాలను తయారు చేసే కంపెనీ. 18 క్యారెట్లు, 22 క్యారెట్ల గోల్డ్‌తో అమెరికన్ డైమండ్స్, క్యూబిక్ జిర్కోనియా, పెర్ల్స్, సెమీ ప్రీషియస్ స్టోన్స్ వంటి విభిన్న రకాల కలెక్షన్స్‌ను తయారు చేస్తోంది. యూకే, న్యూజిలాండ్, యూఏఈ, యూఎస్ఏ, ఫిజీ వంటి దేశాల్లో కూడా మార్కెట్ కలిగి ఉంది. ఈ కంపెనీ రూ. 400.95 కోట్లు సమీకరించనుంది.